క్లుప్తంగా

ఉచిత ఆరోగ్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మీసానిపల్లిలో వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): ఒడ్డేపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీటీసీ బాలమణి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆడపిల్లల తల్లులకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోరేబాయ్, ఎల్లయ్య, గోడాల రేఖ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి కాపాడాలంటూ కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు సోమవారానికి 42వ రోజుకు చేరుకున్నాయి. గ్రామస్తులు ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు సంఘీభావం తెలిపారు.

ఎస్సీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వినతి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఎస్సీలకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని ఎస్సీ 57 ఉప కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పరుశరాం మాట్లాడుతూ.. దళిత బంధు, ఇళ్ల నిర్మాణం కోసం రూ. 3 లక్షలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 3 ఎకరాల భూమి, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. నాయకులు సంకు పోచయ్య, రాజు, హనుమండ్లు, తదితరులున్నారు.

డబుల్ ఇళ్లకు భూమిపూజ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తిమ్మాపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి 10 డబుల్ బెడ్ రూంలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ దామోదర్, మండల బీఆర్ఎస్ నేత జలందర్‌రెడ్డి ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మద్నూర్(జుక్కల్): రైతుల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చైర్మన్ సంఘమేశ్వర్, డైరెక్టర్లు కలిసి రైతులను ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులకు పెద్దపీట వేసిందని వారు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై కుప్రియాల్ స్టేజీ వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న వాహనం రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలులకు కొట్టుకుపోయిన షెడ్డు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మోడెగాంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులకు గ్రామంలోని వీరారెడ్డికి చెందిన ఫౌల్ట్రీఫామ్ రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గాలులకు రేకులు ఎగిరి దూరంగా పడిపోయాయి. షెడ్డులో కోళ్లు లేకపోవడంతో భారీ నష్టం తప్పిందని బాధితుడు తెలిపాడు. గాలులకు రేకులు పనికిరాకుండా పోయాయని వాపోయాడు. ప్రభుత్వ ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఈటల రాజేందర్‌ను కలిసిన నాయకులు



లింగంపేట: ఎల్లారెడ్డికి వచ్చిన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మండలంలోని సజ్జనపల్లి, ఎక్కాపల్లికి చెందిన బీజేపీ నాయకులు కలిశారు. ఆయనను సన్మానించారు. నాయకులు కిష్టయ్య, సాయిలు, డాక్టర్ పోచయ్య, సిద్దిరాంలు ఉన్నారు.

మేడిపండు చందంగా విద్యుత్ వ్యవస్థ

కామారెడ్డి అర్బన్: విద్యుత్ వ్యవస్థ మేడిపండు లాగా తయారైందని 24 గంటల కరెంట్ అని, 16 గంటలే ఇస్తున్నారని, జీతాలు ఇవ్వ లేని స్థితికి ప్రభుత్వం చేరుకుందని జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి సోమవారం ఆరోపించారు. విద్యుత్ ప్రగతి సమావేశాలతో ప్రచారం తప్ప సాధించింది ఏమీలేదన్నారు. రైతులు సొంత డబ్బులతో మరమ్మతులు చేయించుకుంటున్నారని అన్నారు.

జోరుగా కల్తీ సరుకుల విక్రయం

- రోగాల బారిన పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

బిచ్కుంద(జుక్కల్): మార్కెట్‌లో ఎక్కడచూసినా కల్తీ సరుకులే రాజ్యమేలుతున్నాయి. కిరాణ, జనరల్, బ్యాంగిల్ స్టోర్, కన్‌ఫెక్షనరీ షాపులలో సబ్బు బిళ్లలు మొదలుకుని వంటనూనె, అల్లం వెల్లుల్లి పేస్టు, ఫేస్ క్రీం, చిన్నారులు తినే కుర్‌కురేల వరకు అన్ని వస్తువుల్లోనూ కల్తీ జరుగుతోంది. కొందరు వ్యాపారులు నాణ్యత లేని వస్తువులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం మండలాలు జిల్లా కేంద్రం నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అధికారులు సరిగ్గా దృష్టిపెట్టడం లేదు. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారుల అక్రమార్జనకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిఫైన్డ్ పేరుతో మంచి నూనె కామారెడ్డి నుంచి వస్తుంది. కారం, పసుపు, గోధుమ పిండి, కొబ్బరి నూనె మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

అరటి చెట్టు కాండంతో అల్లం పేస్టు

అరటి చెట్టు కాండం, కొమ్మల పచ్చని తోలు వలిచి



నాసిరకం అల్లం వెల్లుల్లి పేస్టు

అల్లం పేస్టు తయారు చేస్తున్నారు. బొప్పాయి పండు గింజలకు మిరియాల ఫ్లేవర్ ఇచ్చి మిరియాలు అంటూ విక్రయిస్తున్నారు. నాసిరకం ధనియాల పౌడర్, ఆవు నెయ్యి, పసుపు, పిల్లలు తినే కుర్‌కురేలు, అందం కోసం ముఖానికి పెట్టుకునే క్రీములు బ్రాండ్ కంపెనీ పేరుతో నాణ్యత లేని నాసిరకం వస్తువులను ప్రజలకు అంటగడుతున్నారు. తయారు చేసిన కంపెనీల చిరునామా, ప్యాకింగ్, ఎక్స్‌పైరీ తేదీలు ప్యాకింగ్‌పైన ఉండవు. వీటి ధర తక్కువగా ఉండడంతో అవగాహన లేని వినియోగదారులు కొనుగోలు చేస్తూ రోగాల బారిన పడుతున్నారు.

ఒక్క కేసూ నమోదు చేయలేదు

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రజలు చూడడానికే హడావిడి చేసి నామమాత్రంగా తనిఖీలు చేపట్టి శాంపిళ్ల పేరిట కొన్ని వస్తువులు తీసుకెళ్తున్నారే తప్ప ఒక్క కేసు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఫిర్యాదులు రావడంతో తనిఖీలకు రావాల్సి వస్తుందని వచ్చి ఆయా దుకాణాల యూనియన్ నాయకులతో అధికారులు సమావేశమై ఇచ్చే మామూళ్లు తీసుకెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమవుతుండడంతో చిన్న కిరాణా దుకాణాల్లో కలర్‌ఫుల్‌గా ఉన్న కెమికల్‌తో తయారు చేసిన బిస్కెట్లు, ముకుల్ ప్యాకెట్లు, గోలీలు విక్రయించడానికి బిచ్కుందలో కన్‌ఫెక్షనరీ షాపులలో స్టాక్ తీసుకొచ్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కారం, పసుపు, మసాలా పొడర్లలో వాడుతున్న రంగుల్లో ఆక్సైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో కాలేయ సంబంధిత వ్యాధులు, కడుపునొప్పి, అల్సర్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. కల్తీ సరుకులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు పలు చట్టాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది కొన్నా రుచిగా ఉండడంలేదు.. పప్పులో కమ్మదనం లేదు. వంట నూనెల్లో నాణ్యత లేదు ..మసాలాల్లో ఘాటుదనం లేదు తప్పనిసరి పరిస్థితుల్లో కల్తీ వస్తువులను కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న కల్తీ సరుకులు విక్రయించే వ్యాపారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చేది మేమే’



ఎల్లారెడ్డిలో విద్యుత్ ప్రగతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: దేశంలో వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తోన్నది తెలంగాణ రాష్ట్రం ఒక్కటేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యుత్ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటైతే విద్యుత్ తీగలపై బట్టలు ఆరవేసుకోవాలన్న నాటి పాలకుల మాటలకు సీఎం కేసీఆర్ దీటైన జవాబిచ్చారని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు పెడితే రాష్ట్రానికి ఏటా రూ.5 వేల కోట్లు ఇస్తామని ఆశ చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ప్రసంగించారు. 9 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఆర్డీవో శ్రీను, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీలు మాధవి, రాజ్‌దాస్, జెడ్పీటీసీ ఉషాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడి, గుడితోనే గ్రామాభివృద్ధి కనిపిస్తుంది

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ప్రతి గ్రామంలో గుడి, బడితోనే ఆ గ్రామ అభివృద్ధి కనపడుతుందని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం అన్నారంలో ఉమారామేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గంప గోవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గోవర్ధన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షలు విరాళంగా అందజేశారు. ఎంపీపీ దశరథరెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, సర్పంచ్ అమృత పాల్గొన్నారు

‘ముత్యాల పోచమ్మ’ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కామారెడ్డి రూరల్: అడ్లూరులో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో వస్తున్న గంపగోవర్ధన్, నర్సింగ్ రావు

ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలి

భిక్కనూరు: ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మొక్కలు నాటి తమ నిరసన తెలిపారు. మొక్కలు నాటుతూ పర్యావరణానికి సహకరిస్తూ తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు.

తెలంగాణ ఏర్పాటు తర్వాతే నాణ్యమైన కరెంటు

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నాణ్యమైన కరెంటును వినియోగించుకుంటున్నామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. సోమవారం బిచ్కుందలో విద్యుత్ ప్రగతిపై సమావేశం నిర్వహించారు. వ్యవసాయ బోరు బావి, విద్యుత్ వినియోగదారులు, కుటీర పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు ఇస్తున్నామన్నారు. లోవోల్టేజ్ సమస్య లేకుండా నియోజక వర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా విద్యుత్‌లో వెలుగు జిలుగుల రాష్ట్రంగా ప్రథమ స్థానంలో ఉన్నామని చెప్పారు. ఎంపీపీలు అశోక్, ప్రతాప్‌రెడ్డి, విద్యుత్ అధికారులు రామేశ్వర్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఎంపీడీవో ఆనంద్ రైతులు పాల్గొన్నారు.



బిచ్కుందలో మాట్లాడుతున్న సింధే

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

– బీజేపీ నేత వెంకట రమణారెడ్డి

భిక్కనూరు/మాచారెడ్డి: రాష్ట్ర జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్‌లు వెనుకబడి ఉన్నారని వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని కామారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ముదిరాజ్ కల్యాణ మండపం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ కోసం నూతనంగా నిర్మించే రేకుల షెడ్డు ఏర్పాటు గురించి ప్రైవేటు సివిల్ ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడారు. రమణారెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ కల్యాణ మండపం నిర్మాణం కోసం చేయూతను అందిస్తానన్నారు. పాలకులు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని.. వారి అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. అలాగే పెద్దమల్లారెడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న మాల పోచమ్మ ఆలయానికి, మాచారెడ్డి మండల కేంద్రంలో ముదిరాజ్, మాదిగ, గౌడ, రజక కుల సంఘాల భవన నిర్మాణాలకు సోమవారం బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి భూమిపూజ చేశారు.



సివిల్ ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి

ఆశావర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి



రాజంపేట: ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ రాజంపేట మండల ఆశావర్కర్లు సోమవారం పీహెచ్‌సీ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, రాత పరీక్ష రద్దు చేయాలని, యూనిఫాం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ విజయమహాలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు.

ఉత్సవాల పేరిట రూ.కోట్ల ప్రజాధనం వృథా



ఎల్లారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లాగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది అమరులైతే దానిని చూడలేక సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే అది ఒక కుటుంబానికి పరిమితమైందన్నారు. వైస్ ఎంపీపీ నర్సింలు, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చిరంజీవులు తదితరులున్నారు.

పేదల కోసం బహుజనుల రాజ్యం రావాలి



కామారెడ్డి టౌన్: పేదల కోసం బహుజనుల రాజ్యం రావాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీఎల్ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగల సిద్ధరాములు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. బహుజన్లకు న్యాయం జరగాలంటే బీఎల్ఎఫ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కార్యకర్తలకు సూచించారు. బహుజన రాజ్యం రావాలంటే రాబోయే ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. నేతలు మధు కాంబ్లే, ముద్రకోల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ధర్మారావ్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీచర్లు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని ప్రభుత్వ ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని సూచించారు.

అధికారుల నిర్లక్ష్యానికి ఎద్దు బలి



పిట్లం(జుక్కల్): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతి చెందిన ఘటన కారేగాంలో చోటు చేసుకుంది. వివరాలు.. కారేగాంలోని పిల్లి వాగు దగ్గర పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు పిల్లలకు సైతం అందేలా వేలాడుతున్నాయి. సోమవారం ఈ విద్యుత్ తీగలకు తగిలి గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 85 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. గ్రామస్తులు మాట్లాడుతూ.. తీగలు కిందికి వేలాడటం గురించి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు.

సామూహిక సీమంతాలు

సాక్షి నెట్‌వర్క్ : ఎల్లారెడ్డి మండలం సబ్దల్‌పూర్, మద్నూర్ మండలం పెద్దతడ్గూర్, దోమకొండ మండకేంద్రం, పెద్దకొడప్‌గల్ మండలం కుబ్యానాయక్ తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. పండ్లు, పౌష్టికాహార వస్తువులు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని 8వ వార్డులో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ వార్డుకు చెందిన ప్రజలు పంచాయితీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వార్డులో కొంతకాలంగా తాగునీటి సమస్య ఉందని పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వార్డు సభ్యుడు మొసర్ల శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నీటి సమస్య పట్ల పంచాయతీ కార్యదర్శి కూడా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీళ్లు కేవలం ఇంటికి రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయని ఆ నీళ్ల సరిపోవడం లేదని వారు పేర్కొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న 8వ వార్డు ప్రజలు

ఆధ్యాత్మికం

■ వైభవంగా బీరప్ప కల్యాణ మహోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్‌లో సోమవారం బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవాలలో భాగంగా ఆలయం వద్ద మేకలు, గొర్రెలను గావు పట్టే కార్యక్రమం చేపట్టారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఉత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

■ ఆంజనేయస్వామి వార్షికోత్సవాలు

నిజాంసాగర్(జుక్కల్): లింగంపల్లిలో ఆంజనేయ స్వామి ఆలయం, నవగ్రహాల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గంగారాం, అంజయ్య, విఠల్, రవి, పండరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జీపీ కార్యాలయాల వద్ద మూకుమ్మడిగా ప్రతిజ్ఞలు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్‌ను నిషేధించడంలో తమ వంతు సహకారం అందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని ప్రజలను అధికారులు కోరారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. – సాక్షి నెట్‌వర్క్

పర్యావరణాన్ని పరిరక్షించాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తమ ఇంటి ముందు, రోడుకు ఇరువైపులా మొక్కలను నాటి కాలుష్యాన్ని నివారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, కమిషనర్ దేవేందర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు సాగునీటి దినోత్సవ సమావేశం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా లింగంపేటలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో మంగళవారం సాగునీటి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. లింగంపేటలో జరుగనున్న సాగునీటి దినోత్సవ సమావేశానికి రైతులందరూ హాజరుకావాలని ఆయన చెప్పారు. దీంతోపాటు ఈ నెల 8న ఊరూరా చెరువుల పండుగను నిర్వహించాలని ఆయన తెలిపారు.

■ 9న ఆలయ హుండీ లెక్కింపు

మద్నూర్(జుక్కల్): మండలంలోని పుణ్య క్షేత్రమైన సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఈ నెల 9న హుండీ లెక్కింపు కార్యక్రమం చేపడుతున్నామని ఆలయ సిబ్బంది వేణు జోషి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతు ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి ఆలయంలోని ఉన్న అన్ని హుండీలు విప్పి లెక్కిస్తామని ఆయన చెప్పారు. దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్, అధికారులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి, భక్తుల సమక్షంలో ఆలయ హుండీని తెరుస్తామని తెలిపారు.

సంక్షిప్తం

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మాచారెడ్డి: మండల కేంద్రంలోని సింగిల్ విండోలోపచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము ఉన్నట్లు మాచారెడ్డి వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ సోమవారం తెలిపారు. 30 కిలోల విత్తనాలు 2 నుంచి 3 ఎకరాలకు సరిపోతాయని ఆమె తెలిపారు. ఈ నెల రెండో వారంలో రైతులు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవాలన్నారు.

జీలుగ విత్తనాలతో పంటలకు మేలు

భిక్కనూరు: జీలుగ విత్తనాలను పంట చేలల్లో చల్లుకోవడం ద్వారా ఎంతో మేలు కలుగుతుందని పెద్దమల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ రాజాగౌడ్ అన్నారు. సోమవారం పెద్దమల్లారెడ్డి సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు సాయగౌడ్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కోకాపేటలో భారత్ భవన్‌కు జరిగిన భూమి పూజ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్ సోమవారం పాల్గొన్నారు. సీఎంను కలిసి శాలువాతో సత్కరించారు.

538 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం 538 మందికి కంటి పరీక్షలు చేశారు. 22 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,49,576 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా.. 65,846 మందికి కంటి అద్దాలను అందజేశారు. జిల్లాలో 98.67శాతం లక్ష్యం పూర్తయింది.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

ఎల్లారెడ్డి: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సమాచార హక్కు చట్టం ఎల్లారెడ్డి డివిజన్ నాయకులు లింగమయ్య అన్నారు. సోమవారం మత్తమాల పీహెచ్‌సీలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, మధుసూదన్ తదితరులున్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

బాన్సువాడ రూరల్: పారిశుధ్య నిర్వహణలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు అలసత్వం వహించరాదని బాన్సువాడ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి సూచించారు. సోమవారం దేశాయిపేట్‌లోని డబుల్‌బెడ్‌రూం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్ శ్రావణ్‌కుమార్, కార్యదర్శి రవి, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

పండుగలను విజయవంతం చేయండి

బాన్సువాడ రూరల్: ఈ నెల 8న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ఊరూర చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి కోరారు. సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ శ్రావణ్‌కుమార్ తదితరులతో కలిసి దేశాయిపేట్ గ్రామ చెరువు కట్టపై కొనసాగుతున్న పండుగ ఏర్పాట్లు పరిశీలించారు.

తెలంగాణ అభివృద్ధిపై ఉపన్యాస పోటీలు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈ నెల 9న బహుమతులు అందజేస్తామన్నారు.